# ఆడది అబలా?

## శివరంజని



**'నువ్వు లేకపోతే నేను బ్రతకలేను రాణీ!' అన్నాడు రాజు.**

**'నువ్వు ఉంటేనే బ్రతుకంటూ ఉంది రాజ్!' అంది రాణి.**

**'ఐ లవ్ యూ హనీ.'**

**'ఐ లవ్ యూ జానీ.'**

ఇద్దరూ ఒకరి కళ్లలోకి ఒకరు, విశాఖ బీచ్‌లోని వెన్నెల మెరుపులో చూసుకుంటూ ఉండిపోయారు.

'ఎవరది?' అని హుంకరించిన గొంతు వినిపించగానే కప్పని తొక్కినట్లు ఉలిక్కిపడ్డాడు రాజు.

'మిమ్మల్నే అడుగుతున్నాను. ఎవరు మీరు? ఇంత రాత్రి మీకేం పని?' అంటూ టార్చ్‌లైటు ముఖాల మీదకి ఫోకస్ చేశాడు ఓ పోలీస్. పోలీస్‌కి ఏ మాత్రం కళా హృదయం ఉన్నా "ఏం పని మీకు?" అని మాత్రం అడిగేవాడు కాదు.

'అయామ్ రాజు ఎమ్మే. దిసీజ్ రాణి......' ప్రమాదంలో ఇంగ్లీషు మాట్లాడితే తెలుగుదేశంలో పని జరుగుతుందనే నమ్మకంతో రాజు కొనసాగిస్తుండగా ...

'ఇంగిలీసాపవయ్యా' అన్నాడు పోలీసు

ఇంగ్లీషు ఆపటంతో రాజు నోటమాట కూడా ఆగిపోయింది.

రాజూ, రాణీ ప్రేమించుకుంటున్నారనీ, కానీ పెళ్లి చేసుకోలేదనీ, కనుకే రాత్రి పన్నెండు గంటలకి బీచ్‌లో ఉన్నారనీ ఏ తలమాసిన వాడికైనా అర్థమవుతుంది. కానీ మాయటానికి తలే లేని ఆ గుండు పోలీసుకి ఈ నిజం చెప్పటం ఆ పోలీసనే కొరివితో తన తల గోక్కోవటమే అవుతుందని రాజుకి తెలుసు. 'మరింకేం చెప్పాలా?' అని తన సొంత బుర్ర గోక్కుంటూ నిలుచున్నాడు.

'చూస్తుంటే ఇది ఇక్కడ తేలే విషయంలా లేదు. పదండి స్టేషన్‌కి'అన్నాడు పోలీస్.

రాజు తన కంగారు బైట పడకుండా ఉండాలని ప్రయత్నిస్తూ, "చూడండి మిస్టర్! స్టేషన్ వరకూ ఎందుకు?....'అంటూ జేబులో చేయి పెట్టి తర్వాతేం చేయాలో తెలీక ఆగిపోయాడు. నిజానికి డబ్బులు ఎలా ఆఫర్ చేయాలో తెలీదు గోల్డ్‌మెడలిస్ట్ రాజుకి.

'అతను జేబులో చేయి పెట్టటం చూసి రాణి అతని చేయి పట్టుకుని- ఏమిటయ్యా నీ గోల? భార్యభర్తలు బీచ్‌కి ఎందుకొస్తారో నీకు చెప్పాలా?' అంది పోలీస్‌తో.

పోలీస్ కంఠం తగ్గించకుండా 'భార్యాభర్తలా? అందుకు రుజువేమిటి? స్టేషన్‌కి పదండి. అక్కడే తేలుద్దురుగాని.' అన్నాడు.

రాణి తన గొంతు కూడా పెంచి,"అలాగే పదండి. రంగనాథం మామయ్యకి ఫోన్ చేసి చెప్తే గానీ ఇతని తిక్క కుదరదు." అంది రాజుతో.

పోలీస్ చేతిలో లాఠీ కిందపడింది.

అయినా అనుమానంతో "ఐజీగారు మీ మావయ్యా అమ్మా?" అన్నాడు నెమ్మదిగా.

"స్టేషన్‌కి వెళ్తే అన్నీ తెలుస్తాయి పదవయ్యా. మరీ అంత తొందరయితే లాసన్స్ బేకి పద. మావయ్య ఉండేది అక్కడే." అంది రాణి.

గుండు పోలీసు గుండె జారిపోయింది. ఐజీగారిల్లు లాసన్స్ బేలోనే ఉండేది మరి.

వెంటనే "అమ్మా! అమ్మా! క్షమించండి, నా ఉద్యోగం పోతుంది. ఆయనతో ఈ విషయం చెప్పకండి. ఇంత రాత్రి మీరుండటం మంచిది కాదు కనుక జీప్‌లో మిమ్మల్ని ఇంటి దగ్గర దింపేస్తాను, రండి" అన్నాడు వినయంగా.

"జీప్ దొరకటం మంచిదే అయింది. మీరు రాసిన కథ 'పురుష సమాజంలో స్త్రీ' ఫెయిర్ చేసి రేపొద్దున్నే పంపించేయచ్చు" అంది రాణి జీప్‌లోకి పోలీస్‌కి వినపడకుండా.

రాజు తలూపి ఊరుకున్నాడు.

❊ ❊ ❊


ప్లాట్‌ఫారం మీద తలపట్టుకుని కూర్చుని ఉన్నాడు రాజు. వాళ్లు అందుకోవలసిన రైలు, వీళ్లు వస్తున్న రైలు కావటం వలన వెళ్లిపోయింది. మరో గంటలో ఇంకేదో ఎక్స్‌ప్రెస్ వస్తుందట. కానీ అందులో రిజర్వేషన్ ఉండదు. మామూలుగా అయితే జనరల్ కంపార్ట్‌మెంట్లో ప్రయాణం చేసేవాడేమో కానీ ఇప్పుడు పక్కన పెళ్లాం, ఆమెతో అంచెలంచెలుగా పెరిగిన పది సామానులూ ఉన్నాయి. వద్దు వద్దన్నా అన్ని శాల్తీల లగేజీ తయారు చేసినందుకు రాణి మీద పీకల వరకూ కోపంతో మండిపోతున్నాడు రాజు. ఇదంతా కాక తామున్నది హిందీ తప్ప ఇంగ్లీష్ కూడా మాట్లాడని నార్త్ ఇండియాలో.

రాజు ఇలా మథనపడుతూండగానే గంటన్నర పూర్తయ్యి రైలు ఝామ్మని వచ్చేసింది. కొత్త అగ్గిపెట్టెలో పుల్లల్లా ఉన్నారు జనం. పది సామాన్లూ, వాటిన్నిటి కన్నా పెద్ద లగేజీ అయిన భార్యని వెంట పెట్టుకుని, అన్ని పెట్టెలూ తిరిగి కెపాసిటీ కన్నా రెండున్నర రెట్లు మాత్రమే జనం ఉన్న ఓ పెట్టె ఎంచుకుని, భార్యని ఎలాగో ఎక్కించాడు. మిగిలిన పది శాల్తీలూ అంత మంది జనంలోనూ నానా అవస్థ పడుతూ ఎక్కిస్తూంటే అతి ముఖ్యమైన అప్పడాలు, వడియాల లాంటి విలువైన వస్తువులతో నిండిన మూట ఇంకా చేతిలో ఉండగా రైలు కదిలిపోయింది. ఆ మూట కూడా విసిరేసి రాజు రైలు ఎక్కబోతే అతను మెట్ల మీద నిల్చోటానికి కూడా మిల్లీమీటరు స్థలం లేదు.

'భాయీ సాబ్. జగా దీజియే. మేరీ బీవీ అందర్ హై' (అయ్యా కొంచెం చోటివ్వండి నా పెళ్లాం లోపల ఉంది) వచ్చీరాని హిందీలో అన్నాడు రాజు కంగారుగా.

"ఉస్‌కేలియే హమ్ క్యా కరేంగే? జగా నహీహై. మేరే సిర్ పర్ బైఠోగే క్యా?" (అందుకు నేనేం చేస్తాను? జాగా లేదు. నా నెత్తి మీద కూర్చుంటావా?) అన్నాడొక పుచ్చుగాడు.

రైలు నెమ్మదిగా వేగం పెంచుతుంటే మరో దారి లేక దొరికిన పెట్టె ఎక్కి (దొరికిన మెట్టు అనాలి) కమ్మీ పట్టుకుని వేలాడుతూ నిల్చున్నాడు రాజు. తెలియని భాషతో. మర్యాద తెలియని నార్త్ ఇండియన్స్ మధ్య తన భార్య ఎలా ఉందోనని భయపడుతూ, ఆంధ్రాలో ఎప్పుడూ అటువంటి ప్రయాణం చేయని తన దుస్థితికి విచారిస్తూ కమ్మీకి వేలాడుతున్నాడు. రైలు యమస్పీడుగా పోతోంది. మధ్యలో ఏదో నది మీద నుంచి రైలు పోతుంటే చేతికి చెమట పట్టి జారిపోతున్నట్లనిపించింది. వెనక జేబులో, పర్సులో నాలుగువేలదాకా ఉన్నాయి. ఎవడేనా తీస్తున్నట్లు తెలిస్తే కూడా 'పోతేపోయింది' అనుకోవలసిన పరిస్థితి! మూడు గంటలు అలాగే ప్రయాణం చేశాక రైలు ఏదో స్టేషన్‌లో ఆగింది. వెంటనే దిగివరుగెత్తాడు. తన ప్రయాణమే ఇంత భయంకరంగా ఉంటే రాణి ఎంత అవస్థ పడుతోందో ఏమో!




ఆమెని ఏ కోచ్‌లో ఎక్కించాడో కూడా తెలియక గుర్తురాక పిచ్చాడిలా వెతకసాగాడు. సమయం గడుస్తున్న కొద్దీ అతని గుండె వేగం పెరుగుతోంది.

ఇంతో 'ఏమండీ' అని రాణి గొంతు వినిపించింది. ముందు తన భ్రమ అనుకుని అయోమయంగా దిక్కులు చూస్తుంటే-

"ఇక్కడండీ.. ఇలా రండి" అని మళ్లీ పిలిచింది.

అటు చూస్తే ఆశ్చర్యం! రాణి! హాయిగా అటువైపు కిటికీ పక్కన కూర్చుని ఉంది. లోపలకు చూస్తే తమ సామానులన్నీ చక్కగా సర్ది ఉన్నాయి. రిజర్వేషన్ కంపార్ట్‌మెంటు. అదికాక జనంతో నిండి ఉంది. అటువంటపుడు రాణికి సీటెలా దొరికింది?

"రండి, ముందు లోపలకి రండి." అందామె. ఇంకా ఆశ్చర్యంతో ఉక్కిరిబిక్కిరవుతూ, ఏమయితేనేం రాణి క్షేమంగా ఉందని సంతోషపడుతూ లోపలకు వచ్చాడు రాజు.

"ఇలా కూర్చోండి." చోటు చేసింది పక్కన. అక్కడ నిజానికి చోటేమీ లేదు. రాజు సంశయిస్తుంటే "అన్నయ్య గారూ కొంచెం జరుగుతారా." అంది ఈ చివర కూర్చున్న(వేలాడుతున్న) ఓ అమాయకుడితో. అతను లేచి నిల్చుని 'ఆప్ బైఠియే'(మీరు కూర్చోండి) అన్నాడు రాజుతో.

"అయ్యో అన్నయ్యగారూ! మీరు నిల్చోవటం దేనికి? అందరం కూర్చుందాం" అంది రాణి అతనితో.

'పరవాలేదు. చాలా సేపు కూర్చుని కాళ్లు పట్టేశాయి' అన్నాడతను.

రాజు ఇంకా తటపటాయిస్తుంటే అతన్ని లాగి కూర్చోపెట్టిందామె. రాజు మొహమాటంగా కూర్చుని. "ఇంతకీ ఆయనెవరు?" అన్నాడు

"అయ్యో! ఈ అన్నయ్యగారే నాకెంతో సహాయం చేశారండీ! బెహన్‌జీ మీరిక్కడ కూర్చోండీ అన్చెప్పి నన్ను కూర్చోబెట్టి సామానంతా ఆయనే సర్దిపెట్టారు. మీ కోసం వెతుకుదామని ఇందాక దిగారు కూడా. ఇంతలో మీరే వచ్చారు." అంది రాణి.

"థాంక్స్ ఫర్ యువర్ హెల్ప్."అని అతనికి కృతజ్ఞతలు చెప్పుకున్నాడు.

"ఏతో హమారా ఫర్జ్ హై" అన్నాడతను మెలికలు తిరుగుతూ.

రాజుకి ఇంకా చాలా సందేహాలున్నాయి. 'హిందీ ఏ మాత్రం తెలియని రాణి వాడితో ఎలా కమ్యూనికేట్ చేసిందీ, వాడెలా అర్థం చేసుకున్నాడూ'లాంటివి. ఏమయితేనేం తన భార్యకేమీ ఇబ్బంది కాలేదు. అదీ కావలసింది.



**చెప్పు - చేతులు**


'ఒరే కావుడూ, ఆ చేతిలోని పొట్లాం ఏంటిరా?'

'అమ్మా... ఇదీ... మరీ... ఇదీ... మీ కోడలి చెప్పులు... తెగిపోతే... కుట్టిద్దామనీ...'

'పెళ్లాన్ని చెప్పు చేతల్లో ఉంచుకోరా అంటే, పెళ్లాం చెప్పుచేతుల్లో ఉంచుకుంటున్నావట్రా !'

"ఆఁ !!!"

వి.వి. సీతారామదాసు
గుంటూరు




అతను నిశ్చింతగా వెనక్కి వాలి కూర్చుంటుంటే-

"ఇదుగో ఇందాక ఎవరో తెలుగాయన చేతిలో కన్పిస్తే తీసుకున్నా. ఇందులో మీ వ్యాసం 'స్త్రీకి స్వతంత్రం ఎప్పుడు?' పబ్లిష్ అయింది." అంది రాణి.

"నిజమా?" అంటూ తన వ్యాసం, పక్కన తన పేరూ చూసుకుని మురిశాడు రాజు.

* * *

రాజు చికాగ్గా ఉన్నాడు. గాస్ అయిపోయింది. కొత్త సిలిండర్ తెచ్చుకోవాలి. పది రోజుల నుండీ ఈ విషయం మీదే చాలా విసుగు చెందుతున్నాడు. కానీ అందుకు చేసిందేమీ లేదు. ఎందుకంటే ఆ డీలర్‌గాడి ముఖం చూడాలంటే అసహ్యంగా ఉంది.

గాస్ అయిపోయిన రోజు వెళ్లి ఆ డీలర్‌గాడి ముందు నిల్చుని కొత్త సిలిండర్ ఎప్పటికి రావొచ్చని వీలయినంత మర్యాదగా అడిగాడు రాజు. రాజుని చూడగానే వాడికి ప్రపంచంలోని ముఖ్యమైన పనులన్నీ గుర్తుకొచ్చి, టేబుల్ మీది పేపర్లన్నీ సర్దడం, ఇటు పక్క ఫైల్స్ అటుపక్క పెట్టటం వంటి అప్పుడే చేసి తీరవలసిన పనులన్నీ చేస్తూ, రాజు జవాబు కోసం నిరీక్షిస్తూ అరగంట నిల్చున్నా తలెత్త లేదు. బెంగాల్‌లో ఉద్యోగం వచ్చిన కొన్ని రోజుల తర్వాత నుంచి సహనం పెంచుకున్న రాజు మళ్లీ మర్యాదగా అదే ప్రశ్న వేశాడు.

అప్పుడు మనుష్యుల తలరాతలు రాస్తున్న బ్రహ్మ బ్రహ్మాండం బద్దలైతే తలెత్తినట్లుగా పైకి చూసి-

"రేపు" అన్నాడు వాడు క్లుప్తంగా.

"రేపు కచ్చితంగా వస్తుంటారా?"

"అనే నా అభిప్రాయం" అనేసి మళ్లీ దేశ సమస్యలు విచారించటంలో మునిగిపోయాడు.

రాజు కంపరంతో రగలిపోతూ వచ్చేశాడు. తర్వాత ఎప్పుడు అటువైపు వెళ్లాలన్నా సత్యజిత్‌రేలా ఇంటలెక్చువల్ పోజులో సిగరెట్టు కాలుస్తూ కాశ్మీరు సమస్య చర్చిస్తున్న ప్రధాని కన్నా బిజీగా ఉన్నట్లు కనిపించే ఆ బెంగాలీ డీలర్‌ని చూసే ధైర్యం ఉండటం లేదు. వాడంతట వాడు సిలిండర్ పంపనూ లేదు.

ఈ రోజు ఎవరో సలహా ఇచ్చారు. సిలిండర్స్ తీసుకోవచ్చని. 'ఇది బాగానే ఉంది కానీ ఇందులో ఏం లొసుగుందో, బెంగాల్‌లో పనులు త్వరగా అయి చస్తాయా' అనుకుంటూ ఇంటికి బైల్దేరాడతను ఆఫీస్‌లో పర్మిషన్ తీసుకుని.

దారిలోనే సిలిండర్ల వాను, ఖాళీ సిలిండర్లతో లైనులో నిల్చున్న జనం కన్పించారు. తను ఇంటికి వెళ్లి వచ్చేసరికి వేన్ వెళ్లిపోతుందేమో వాడిని కాసేపు వెయిట్ చేయమని అడగాలనుకుని (వాడెలాగా వెయిట్ చేయడు అది వేరే విషయం) స్కూటర్ ఓ పక్క ఆపాడు. ముందుకు వెళ్ల బోతూ రోడ్డుకి ఇవతల పాకలో ఓ స్టూలు మీద కూర్చుని ఉన్న ఓ అమ్మాయిని చూసి ఆగాడు రాజు.

"నువ్విక్కడ కూర్చోమ్మా. నీ సిలిండర్ వరకూ లైను రాగానే నేను మార్పిస్తాను" అంటున్నాడు. ఎవడు? వాడే సత్యజిత్‌రే గాడే. అదే! తలరాతలు రాసే వెధవ. వాడికి ఇంత మర్యాద తెలుసా?

ఇంతలో 'దాదా నంబర్‌లూ ఆస్బే'(అన్నా నంబరు వచ్చింది) అని అరిచాడు. ఓ బల్ల దగ్గర కూర్చుని సిలిండర్లు ఇష్యూ చేస్తున్న మరో సిద్దార్థ శంకర్ రే. తన గాస్ సిలిండర్ పాస్ బుక్ వాడి దగ్గరే ఉంది.

"సరే. కొత్తసిలిండర్ రిక్షా ఎక్కించు. అమ్మాయిగారు తీసుకెళ్తారు" అని బెంగాలీలో చెప్పి. "నీ పని అయి పోయిందమ్మా. కాస్త మజ్జిగ తాగి వెళ్లు. అసలే ఎండ." అన్నాడు సత్యజిత్ రే రాణితో.

'పర్లేదులే తాతా. వెళ్తాను మా ఆయన వచ్చేస్తారు.'

"మీ ఆయనంటే ఆ బాబేనా అమ్మా? కళ్లద్దాలతో సన్నగా రివటలా ఉంటాడు?"

రివటలా ఉంటానా నీ మొహానికి చవటలా కన్పిం చానా? అనుకున్నాడు రాజు

"అవును. నీకు తెలుసా?"

"ఎందుకు తెలియదమ్మా సిలిండర్ కోసం వచ్చాడు కదా! ఇక్కడ ఎవ్వడూ పని చేయడు. నేనొక్కడినీ ఎన్నని చూడగలను? అందుకని తర్వాత రమ్మన్నాను. పోనీలే ఈ రోజు నీ పని అయిపోయింది."

'ఓరి సన్నాసీ ! నువ్వొక్కడివే పని చేస్తున్నావా? ఈ లెక్కన నీ ఉద్దేశ్యంలో పని చేయని వాడంటే ఎవడో?' అనుకున్నాడు రాజు.

'రాణి వెళ్లేవరకూ ఆ పక్కనే ఆగి, తర్వాత స్కూటర్ మీద అక్కడా అక్కడా తిరిగి కావాలనే ఇంటికి ఆలస్యంగా చేరాడు. లోపలకు రాగానే మంచినీళ్ల గ్లాసు అందిస్తూ, 'గాస్ వచ్చేసిందండీ' అంది రాణి.

"నిజమా?" అన్నాడు రాజు తెలియనట్లు.

"నిజమేనండీ. ఆ డీలర్‌కి మీరు బాగా(ఒక వాజమ్మ గా) తెలుసు. నన్ను చాలా మర్యాద చేసి సిలిండర్ రిక్షా ఎక్కించి మరీ పంపాడు."

"వెరీ గుడ్" అన్నాడు రాజు.

"ఇకపోతే 'ఆడది ఎప్పటికీ అబలేనా?' అనే టాపిక్‌తో మీరుఅఖిల భారత మహిళా జనోద్ధరణ సమితి తాలూకు మీటింగ్‌లో ఉపన్యసించాలట. ఈ రోజే ఉత్తరం వచ్చింది.' "అలాగా" అన్నాడు రాజు నిర్వికారంగా.

"అంతే కాదు. స్త్రీవాదంతో రచనలు చేస్తున్న మీకు సన్మానం కూడా ఉందంట."

ఈసారి రాజు మురిసిపోలేదు కానీ మరొకందుకు నవ్వుకున్నాడు.

"ఆడది అబల అన్న చవట ఎవడంటా?!"

